ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

జమదాలలో చెరువుకు గండి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని జమదాల గ్రామంలో కృష్ణమ నాయుడు చెరువుకు గురువారం గండి పడింది. ఎంపిడిఒ అఖీబ్ జావేద్, ఇరిగేషన్ డిఇ వేలితో కలిసి గండిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గట్టు బలహీనపడిన కారణంగా చెరువుకు గండి పడిందన్నారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి త్వరలోనే చర్యలు చేపడతారన్నారు.

గండిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, డిఇ

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు అన్నదాతలను పూర్తిగా కుంగదీశాయి. పంట చేతికొచ్చే సమయంలో కోలుకోలేని రీతిలో దెబ్బతీశాయి. మిచౌంగ్ తుపాను కారణంగా గడిచిన మూడు రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ఖరీఫ్ సీజన్లో వరిపంట ప్రధానమైనది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరి రైతులు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇంతవరకు ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం ఒక శాతం కూడా ఉండదు. 90 శాతం మంది రైతుల పంట పొలాల్లో కుప్పలు, కోత కోయకుండా ఉంది. ప్రస్తుతం ధాన్యం రంగు మారే ప్రమాదం ఉండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాలూరు.. నీటిలో ఉన్న వరిచేను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పాచిపెంట.. నేలకొరిగిన వరిచేను పైకి లేపుతున్న రైతులు

కోలుకోలేని దెబ్బ

- ఇంకా వరదనీటిలోనే వరిచేలు
- ధాన్యం రంగుమారే అవకాశం
- కొనుగోలుపై అనుమానాలు
- దిగుబడి తగ్గే అవకాశం
- అన్నదాత గుండెల్లో గుబులు

ప్రజాశక్తి-సాలూరు

మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా సాలూరు నియోజకవర్గ పరిధిలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. దీంతో కుప్పలు వేసిన రైతులు కూడా నష్టపోయే అవకాశం ఉంది. తుపాను ప్రారంభానికి ముందు ఆదరాబాదరాగా రైతులు వరి మడుల్లో కుప్పలు వేశారు. భారీ వర్షాలకు ఆ కుప్పలు కూడా తడిసి ముద్దయ్యాయి. అంతే కాకుండా కుప్పలచుట్టూ వరద నీరు చేరడంతో మడులు చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. కోత చేయకుండా ఉన్న భూముల్లో కూడా వరి చేలు నేలకొరిగాయి. మడుగు నీటిలో వరిచేలు మునిగి ఉన్నాయి. దీంతో ఈ సీజన్లో రైతులు పండించిన వరి పంటలో 90 శాతం రంగు మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అది ఎంతవరకు అమలవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంగు మారిన ధాన్యానికి, తేమ శాతం ఉన్న ధాన్యానికి నిర్దేశిత మద్దతుధర లభిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే. తడిసిన ధాన్యం బాగా ఎండబెట్టిన తరువాత రైతులు విక్రయించాలి. ఎంత ఆరబెట్టినా ధాన్యం రంగు మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎకరానికి రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చిన సమయంలో తుపాను వారి వెన్ను విరిచింది. కోత కోయని పొలాల్లో వరి చేలు నీటిలో మునిగిపోవడంతో చాలావరకు గింజలు భూమిలో పడిపోతాయి. దీని వల్ల కూడా రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడి రాదు. మక్కువ మండలంలో ఎకరానికి 33 బస్తాల ధాన్యం, పాచిపెంటలో 30 బస్తాలు, సాలూరు మండలంలో 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని తుపానుకు ముందు అంచనా వేశారు. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వరి పంట నీటిలో మునిగిపోవడంతో దిగుబడి బాగా తగ్గిపోయే అవకాశం కనిపిస్తోంది.

కొనుగోలు కేంద్రాలేవీ?

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. తుపాను ముప్పు ముంచుకొస్తున్న తరుణంలో అధికారులు రైతుల వద్ద మట్టించి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. ఈ విధంగా ఆఫ్‌లైన్‌లో సాలూరు మండలంలో 326 మెట్రిక్ టన్నులు, మక్కువలో 73 మెట్రిక్ టన్నులు, పాచిపెంటలో 11 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తడిసిన ధాన్యం ఆరబెట్టి అమ్మకానికి సిద్ధం చేసేసరికి రైతులకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అధికారికంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమనేది మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది.

500 ఎకరాల్లో నష్టం అంచనా

నియోజకవర్గంలో మూడు మండలాల్లో గడిచిన మూడు రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తి స్థాయిలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది పరిశీలిస్తే నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉంది.

వరదనీటిలో ఉన్న వరిచేను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

వరి రైతులకు తీవ్ర నష్టం

సాలూరు : వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి డిమాండ్ చేశారు. గురువారం టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్‌తో కలిసి కూర్మరాజుపేటలో మునిగిపోయిన వరి పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పండించిన రైతులు పూర్తిగా నష్టపోయారని చెప్పారు. ముడుకు లోతు నీటిలో వరి పొలాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆమె వెంట టిడిపి నాయకులు ఎ.వెంకటనాయుడు, కోటేశ్వరరావు, సర్పంచ్ ఎ.నళిని ఉన్నారు.

క్యాబేజీ రైతు కుదేలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆరుగాలం కష్టించి సాగుచేసి పంట చేతికి అందివచ్చే తరుణంలో తుపాను ప్రభావం వల్ల క్యాబేజీ రైతులు కుదేలయ్యారు. మండల కేంద్రం వీరఘట్టంతోపాటు బూరుగ, కొట్టుగుమ్మడ , నడుకూరు, చిదిమి తదితర గ్రామాల్లో సుమారు 350 మంది కూరగాయల రైతులు 450 ఎకరాల్లో క్యాబేజీ పంట సాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, తదితర ఖర్చులు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 3 నుండి వర్షాలు పడకపోవడంతో పంట దిగుబడి అధికంగా లేనప్పటికీ బహిరంగ మార్కెట్లో ధర కూడా లేదని కూరగాయల రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో 10 కిలోల క్యాబేజీ పువ్వు రూ.300 పలికేదని, ప్రస్తుతం రూ.150 కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంట భువనేశ్వర్, విశాఖపట్నం, సిరిపురం, శ్రీకాకుళం, ఆమదాలవలస, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావం వల్ల క్యాబేజీ పువ్వు చెమ్మచెరి, పురుగు పట్టి కుళ్లిపోవడం వల్ల తీవ్రంగా పంట నష్టం వాటిల్లినట్లు రైతులు జామి అప్పారావు, కర్రి గురు ప్రసాద్, కె.సింహాచలం, వెంకటి, తిరుపతిరావు, తదితరులు గగ్గోలు పెడుతున్నారు.

కుళ్లిపోయిన క్యాబేజీ పువ్వులను చూపిస్తున్న రైతు అప్పారావు

మక్కువ మండలం మార్కొండపుట్టిలో తడిసిన వరిచేనుపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయిస్తున్న విఎఎ

తడిసిన పంటపై పిచికారీ

వీరఘట్టం : వర్షాలతో తడిసిన పంటకు గురువారం రేగులపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రత్నకుమారి పర్యవేక్షణలో ఐదు శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేశారు. పిచ్చికారీ చేయడం వల్ల పంట తడిసినా, ధాన్యం రంగు మారే అవకాశం ఉండదని ఎడి రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎఒ జక్కువ సౌజన్య, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

మక్కువ : తుపాను కారణంగా తడిసి ముద్దయిన వరి పైరుపై ఉప్పు నీరు పిచికారీ చేయాలని మార్కొండపుట్టి సచివాలయ ఉద్యాన శాఖ సహాయకులు సత్యవతి రైతులకు సూచించారు. గైశాల తదితర గ్రామాల్లో దగ్గరుండి రైతులతో వరి ధాన్యంపై ఉప్పునీటి పిచికారీ కార్యక్రమం చేపట్టారు.

తుపానుతో తీవ్ర నష్టం

పాచిపెంట : తుపానుతో కురిసిన వర్షంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని కొటికిపెంట, గోగాడవలస గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. పంట నష్టాన్ని అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులను ఆదుకుంటామని ఆయన హామీనిచ్చారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. తడిసిన ధాన్యం, దెబ్బతిన్న కూరగాయల పంటలను పరిశీలించారు. మండలంలోని పుత్తూరు పంచాయతీ దిబ్బగుడివలసలో రైతు పి.తిరుపతికి చెందిన కళ్లాల్లోనే తడిసిపోయిన 100 బస్తాల ధాన్యాన్ని పరిశీలించారు సంఘంవలసలో నష్టపోయిన కూరగాయల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా తడిసి రంగు మారిన ధాన్యాన్ని ముఖ్యమంత్రి ప్రకటించినట్లు, షరతులు లేకుండా మద్దతుధరకు కొనుగోలు చేయాలన్నారు. కూరగాయల రైతుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన క్యాబేజీ సాగుచేసిన రైతులను ఉద్యాన శాఖ ద్వారా పరిశీలించి, ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, నాయకులు శంకర్రావు, శివున్నాయుడు, ఉన్నారు.

పత్తి రైతులకు నష్టం

రావికోన పంచాయతీలో పత్తి పండించిన రైతులు తుపాను కారణంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, సర్పంచ్ కె.రామస్వామి డిమాండ్ చేశారు. రావికోన పంచాయతీ పరిధిలో దెబ్బతిన్న పత్తి పంటను ఆయన పరిశీలించారు పత్తి పంట తడిసి రాలిపోవడంతో రైతులు మొత్తం నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బలిజిపేట : తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు ఆవు సాంబమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. బలిజిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపానుతో కురిసిన వర్షాల వల్ల వరి, పత్తి, అరటి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. నిబంధనలతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు వై.కృష్ణమూర్తి, రాములు, నేలయ్య పాల్గొన్నారు.

సాలూరు : మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటకు ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం నెలిపర్తి గ్రామంలో మునిగిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. రైతులను అడిగి నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట చేతికొచ్చిన సమయంలో తుపాను రైతులను పూర్తిగా దెబ్బతీసిందన్నారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రంగు మారిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. బొర్రపణుకువలస, నారింజపాడు గ్రామాలలో మునిగిన వరి పొలాలను సిపిఎం మండల నాయకులు వంతల సుందరరావు, గెమ్మెల జానకిరావు పరిశీలించారు.

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన

కొమరాడ : తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన కొమరాడలో జూనియర్ కళాశాల సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. పంట నష్టాన్ని వెంటనే గుర్తించి, నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు ఉపేంద్ర, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గౌరు నాయుడు, పోలినాయుడు, లక్ష్మణరావు, ఈశ్వరరావు, వెంకట్రావు, సుబ్బారావు, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్.. తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

రావికోనలో రాలిపోయిన పత్తిని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అంగన్వాడీల సమ్మె 12కు వాయిదా

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

తుపాను, భారీ వర్షాల కారణంగా అంగన్వాడీలు 8 నుంచి చేపట్టే సమ్మెను 12వ తేదికి వాయిదా వేసినట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తుపానుతో పంట నష్టం వాటిల్లిన దృష్ట్యా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్నిచోట్ల అంగన్వాడీ సెంటర్లు నీట మునిగాయని చెప్పారు. మరికొన్ని సెంటర్లలో వరద బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి చేపట్టే సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11న శిశు సంక్షేమ శాఖ మంత్రితో జరిగే చర్చలు విఫలమైతే 12 నుంచి సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు.

అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో పాపయ్యవలస, మోసూరువలస అంగన్వాడీ టీచర్, ఎ.వెంకంపేట ఆయా పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ అనంతలక్ష్మి తెలిపారు. జులై ఒకటో తేదికి 21 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాలి. ఆ గ్రామానికి చెందిన వివాహిత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కుల, నివాస ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు దరఖాస్తుతో జతచేసి, ఈ నెల 14వ తేదీ సాయంత్రంలోగా పాచిపెంటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

ఓటరు జాబితాపై పక్కాగా విచారణ

ఓటర్ల జాబితా పరిశీలకులు శ్యామలరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఓటరు జాబితా విచారణ పక్కాగా చేపట్టాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన.. ఓటరు నమోదు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఫారం-6, 7, 8 ఏవిధంగా విచారణ చేశారో ఆయా ఫారాలను జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలలో వివిధ బూత్ స్థాయి అధికారుల వద్ద స్వయంగా పరిశీలించారు. ఒక్కో బూత్ స్థాయిలో ఏ సంఖ్యలో దరఖాస్తులు అందాయో పరిశీలించారు. ఓటరు ఫారాల విచారణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను ఆయా వ్యక్తులు సమర్పించారా? లేదా సుమోటోగా సమర్పించారా? వంటి విషయాలను ఆరాతీశారు. ఒకే ఇంటి నంబరుతో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండటం, ఒకసారే గంపగుత్తగా దరఖాస్తులు సమర్పించడం వంటి అంశాలను పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు రోజుల నిర్వహణ, అందిన దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించే ప్రక్రియను విచారించారు. ఒకే ఫొటోతో ఎక్కువ ఓట్లు ఉండటం, ఒకే ఓటు రెండు సార్లు లేదా అంతకంటే ఎక్కువ సార్లు నమోదు వంటి అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పక్కాగా విచారణ చేయాలని, ఎండార్సుమెంటు నివేదిక సరిపోవాలని ఆదేశించారు. విచారణకు సంబంధించిన పత్రాలు నిర్దిష్టంగా ఉండాలని, చేర్పులు, మార్పులు జరిగితే వాటి వివరాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో ఒకే ఫొటో పలుమార్లు ఉంటే వాటిని గమనించి ప్రామాణిక పద్ధతిలో సరిచేయాలని చెప్పారు. ప్రతి బూత్‌లో బూత్ స్థాయి ఏజెంట్ ఉండాలని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించారు. మృతిచెందిన ఓటర్ల తొలగింపు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని, సంబంధిత పత్రాలు ఉండాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 37873 మంది యువ ఓటర్ల అంచనాలో ఇప్పటికే 8633 మంది మాత్రమే నమోదైనట్లు వివరించారు. జనాభా - ఓటరు నిష్పత్తిలో తేడాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ నిష్పత్తిలో ఉంటే కారణాలు విశ్లేషించాలని సూచించారు. ఈ నెల 26 వరకు అందిన అభ్యంతరాలు, క్లైమ్‌లు పరిష్కరించి తప్పులు లేని తుది ఓటరు జాబితా ప్రకటించుటకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ అందిన ప్రతి ఫిర్యాదును విచారిస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన ఓటర్ల వివరాలు ఓటరు నమోదు అధికారి విధిగా పరిశీలించాలని ఆదేశించామని చెప్పారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో చేర్చిన ఓటర్ల వివరాలు పార్టీలకు అందించడం వల్ల అపోహలకు తావు ఉండదని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఓటరు నమోదు అధికారులు- సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణు చరణ్, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎం.లావణ్య., కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, టిడిపి ప్రతినిధి జి.వెంకటనాయుడు, సిపిఎం ప్రతినిధి రెడ్డి వేణు, వైసిపి ప్రతినిధి మరిశర్ల బాపూజీ నాయుడు, సిపిఐ ప్రతినిధి ఇవి నాయుడు, జనసేన పార్టీ ప్రతినిధి బడే శ్రీనివాసరావు , బిజెపి ప్రతినిధి పారిశర్ల అప్పారావు, ఆమ్‌ఆద్మీ ప్రతినిధి పి.రవికుమార్, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకులు శ్యామలరావు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్ఒ, రైటర్, కంప్యూటర్, సిబ్బంది, కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదులను పరిశీలించారు. వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, క్రైమ్ రికార్డులను, కేసు నమోదు మొదలు, కోర్టు డిస్పోజల్ వరకు గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్, ఇతర కేసుల సిడి ఫైల్స్, పెండింగ్ ట్రయల్ కేసుల ఫైళ్లు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు విధానం, పురోగతి గూర్చి ఆరా తీశారు. సదరు కేసుల ఛేదించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లలో స్టాపర్లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించి, వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణా చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం, పోలీసు సిబ్బందితో ఎస్‌పి మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి ఎస్.ఎం.డి.అజీజ్, చినమేరంగి సిఐ ప్రసాద్, ఎస్ఐ కళాధర్, సిసి సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

తడిసిన వరిచేను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

గిరిజన గ్రామాల్లో శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీలో దారపాడు, గాడిదపాయి, దోనుబాయి గ్రామాల్లో వ్యవస్యా పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త పి.సీతారాం, శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణ, సౌజన్య పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత నెల 15న జెఎన్‌టియు జివి అనుబంధ కళాశాల అయిన జిఎంఆర్ ఐటి (రాజాం), విజయనగరం కళాశాల మైదానంలో జరిగిన సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటి వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్లు నిర్వహించారు. ఇందులో భాగంగా బి. ప్రశాంత్ (విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఎం. భార్గవ రాజు గుప్త (గొన్నా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), ఐ. సతీష్ (ఐతం కాలేజ్, టెక్కలి),ఎ. వినయ్ కుమార్ (డైట్ కాలేజ్, అనకాపల్లి), కె. మౌనీష్ (జిఎంఆర్ ఐటి, రాజాం) పూజిత (ఐతం, టెక్కలి) వై. ప్రజ్ఞా కుమారీలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆది కవి నన్నయ యూనివర్సిటీ రాజమండ్రి లో జరగబోతున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని జె.ఎన్.టి.యు. జి వి ఉపకులపతి ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎవి పాపారావు , ఫిజికల్ డైరెక్టర్స్ కె.నాగరాజు , ఎమ్. ఎల్లారీశ్వరి తెలిపారు.

'మళ్లీ జగనే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం 35, 40 డివిజన్లలో జరిగాయి. వైసిపి జోనల్ ఇన్చార్జి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు. సచివాలయాలలో లబ్ధిదారుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైసిపి పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా బంగారు నాయుడు, కార్పొరేటర్లు ధనలక్ష్మి, చందక శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల చెంతకే అందిస్తూ సుపరిపాలనకు నాంది పలికారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తే మరింత మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అన్నారు.

పిల్లల భవిష్యత్తును కాపాడాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు పరిసర ప్రాంతాల్లో చిన్నపిల్లల్ని ఎత్తుకొని భిక్షాటన చేస్తున్న వారిని ఐసిడిఎస్, పోలీసుశాఖ వారు విచారించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ సత్తి అచ్చిరెడ్డి కోరారు. చిన్నారులను ఎత్తుకొని బస్సుల వద్ద, ఇతర వాహనాల వద్ద బిక్షమెత్తుకుంటున్న మహిళలు పిల్లలు వారి పిల్లలేనా? ఎక్కడి నుంచైనా ఎత్తుకు వచ్చారా అనే కోణంలో విచారించాలని కోరారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పేదలకు సహాయం చేయడం తనకు ఎంతో తృప్తినిస్తుందని డిఐఒ టి.జగన్మోహనరావు అన్నారు. గురువారం పట్టణ శివారులో ఉన్న నిరాశ్రయులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. అక్కడి పిల్లలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, సూచనలు చేశారు. మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

మానవ హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

బాలల మానవ హక్కులను కాపాడాలని జర్మనీ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి లిస్సీ కోరారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ క్లబ్ పని విధానాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు, మానవ హక్కులను కాపాడేందుకు క్లబ్ సభ్యులు పని చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు నివారణకు పని చేయాలన్నారు. బాలలు చదువుకోవాలని సూచించారు. బాలలు, మానవ హక్కులను కాపాడేందుకు పని చేస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. హ్యూమన్ రైట్స్ క్లబ్ సక్రమంగా పని చేసేలా విద్యార్థులకు సహకరిస్తున్న హెచ్.ఎం శ్రీనివాసరావును, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో పిట్టాడ, గుర్ల, జిటిపేట, మెంటాడ, చల్లపేట గ్రామాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లపేట డిసిసిబి బ్రాంచి మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసురావు మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీతో మహిళా సంఘాలు, గృహ నిర్మాణం కోసం, బంగారు నగలు, చదువు నిమిత్తం రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇటీవల చల్లపేటలో బ్రాంచి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనేథ్యంలో బ్రాంచిలో ఖాతాలు నమోదు చేసుకుని బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెంటాడ పిఎసిఎస్ సిఇఒ వి ప్రసాదరావు, సిబ్బంది పతివాడ విశ్వేశ్వరరావు, మహంతి రాంమోహన్, వార్డు మెంబర్ సిరిపురం గోవిందా తదితరులు పాల్గొన్నారు.

యువ సంగం ఫేజ్ 3 ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర ప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అద్భుతమైన సాంస్కృతిక మార్పిడి కార్యక్రమానికి నాంది పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన యువ సంఘం మూడో విడత కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి ఇద్దరు చొప్పున 48 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకుల బృందం న్యూఢిల్లీకి వెళ్తున్నారు. ఈ బృందం వెళ్తున్న వాహనాన్ని డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్ర స్వామి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి జండా ఊపి ప్రారంభించారు. యువత దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి దేశ సంస్కృతి సంప్రదాయాలు, సాంకేతిక ఆవిష్కరణలను చూసేందుకు యువసంగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు టి.వి. కట్టిమణి తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-డెంకాడ, గుర్ల, గరివిడి, చీపురుపల్లి

పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటా మని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సబ్సిడీపై మినుము విత్తనాలను కూడా అందించనున్నట్లు తెలిపారు. మిచౌంగ్ తుపాను కారణంగా గుర్ల మండలం గుర్ల గ్రామం, గరివిడి మండలం శివరాం, చీపురుపల్లి మండలం పేరిపి గ్రామంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను చైర్మన్ పరిశీలించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పల నాయుడుతో కలిసి ముందుగా డెంకాడ మండలం చొల్లంగిపేట గ్రామంలో పర్యటించి, దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంట దెబ్బతిన్న రైతాంగానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికార బృందాలు ప్రతీ గ్రామంలో పర్యటించి, పంట నష్టం వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు., రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రయోజనాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు జిల్లాలో కొన్నిచోట్ల మినుము పంట కూడా నీట మునిగి దెబ్బతిన్నదనీ, ఆదుకోవాలని రైతులు కోరగా, సబ్సిడీపై మినుము విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశిస్తూ, పేరిపి గ్రామంలో రైతులకు ట్రక్ షీట్లను అందజేశారు. పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, అధికారులు పాల్గొన్నారు.

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

రైతుల నుంచి తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జెడ్‌పి చైర్మన్ కోరారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులతో సమావేశమై చర్చించారు.

జిల్లాలో కొన్ని మండలాల్లో భారీవర్షాల కారణంగా పొలాల్లో కుప్పలుగా వేసి వున్న వరి పంట కొంతమేరకు దెబ్బతిన్నదని, తేమ శాతం విషయంలో కొంతమేరకు నిబంధనలు సడలించి కొనుగోలు చేయాల్సి వుందన్నారు. వారం రోజుల అనంతరం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే అవకాశం వున్నందున కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే తెరచి సిద్ధం చేయాలని పౌరసరఫరాల సంస్థ అధికారులకు సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ వి.టి.రామారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిపేటలో తడిచిపోయిన వరిచేనును జెడ్‌పి చైర్మన్‌కు చూపిస్తున్న రైతు

అర్హులందరికీ పథకాలు


సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గురువారం మండలంలోని పెదబోగిలిలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రవణమ్మ శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఎంపిటిసిలు సురగాల గౌరీ కిరణ్, జి.కుసుమ సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టి రాజు, ఆర్‌వి పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని పుట్టూరు సచివాలయ పరిధిలో గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన ఎందుకు జగనే కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలో ఇంతవరకు 48.58 కోట్ల రూపాయల మేర ప్రత్యక్షంగా, పరోక్షంగా, స్థానిక అభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి గుంట్రెడ్డి సతీష్ కుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపి బి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, మజ్జి శేఖర్, సర్పంచ్ సంపంగి జగదీష్, పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరు పంచాయతీకి చెందిన బుర్ర రమణ ఇటీవల రెండు కిడ్నీలు చెడిపోవడంతో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించారు. ఆయన కుటుంబానికి సిఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.2లక్షలను గురువారం ఎమ్మెల్యే వి.కళావతి చేతుల మీదుగా రమణ భార్య స్వాతికి అందజేశారు. కార్యక్రమంలో బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్, జెసిఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ సభ్యులు ఎం.చలపతిరావు, సచివాలయం కన్వీనర్ వి.చిరంజీవులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఎన్నికల సంఘం కరపత్రాలను విడుదల చేస్తున్న బాబ్జీ, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు

9లోగా ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 9లోగా అర్హులైన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని ఓట్ ఇండియా సేవ్ డెమోక్రసీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం ఆయన పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్ప ఆయుధమని అన్నారు. ఓటు హక్కు పొందడంలో యువత నిరాసక్తత ప్రదర్శించడం తగదన్నారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఓటు ఉన్న వారిలో కూడా చాలా మంది పోలింగు రోజున ఓటు వేయడానికి రావడం లేదని, అది ప్రమాదకరమని చెప్పారు. ఓటు హక్కు పొందడం ద్వారా ప్రశ్నించే అవకాశం కలుగుతుందని తెలిపారు. అనంతరం ఎన్నికల సంఘం జారీచేసిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భాస్కరరావు, సిహెచ్.ప్రసాదరావు, ఓట్ ఇండియా సేవ్ డెమోక్రసీ ప్రతినిధులు గోపాలరావు, నరేష్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమాన్ని పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు నిర్వహించారు. బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం బి.రమణ, కె.హరిప్రియ, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-సీతంపేట

టిటుకపాయి పంచాయతీ పరిధిలోని కుసుమరు, టిటుకుపాయి, టిటుకుపాయిగూడ గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో గురువారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మండంగి ప్రకాశం, సర్పంచ్ బిడ్డిక అప్పారావు, కొండగొర్రి లక్ష్మణరావు, మండంగి భూషణరావు, మండంగి రామారావు, కొండగొర్రి జనార్ధి, పువ్వు భాస్కర్ రావు, మండంగి కుమార్, బిడ్డిక విశ్వనాథం, కొండగొర్రి రాము, ఆరిక వెంకటేష్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

పంట నష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

తుపాను కారణంగా నష్టపోయిన పంటలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ నాయకులు పి.భూదేవి పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం సీతంపేట క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. రోడ్లు, విద్యుత్తుకు సంబంధించిన సమస్యలను అధికారులకు నివేదించాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు గూర్చి పలు సూచనలు చేశారు. సమావేశంలో మాజీ ఎంపిపి సవర కుంపి, మాజీ సర్పంచ్ సవర గంగయ్య, సీనియర్ నాయకులు సవర మంగయ్య, మూటక కూర్మారావు, యువ నాయకులు సవర శిమ్మయ్య, సవర మల్లేష్, సవర బాలరాజు, పువ్వల ఖైలాష్, సవర శరత్, సవర అక్కరాజు, సవర సింహాచలం, నిమ్మక బాలరాజు, ఆరిక మురళీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీ

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి - తెర్లాం రోడ్డు అధ్వాన్నంగా మారింది. గొల్లపల్లి సమీపంలో పిరిడి జంక్షన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతిలో గురువారం లారీ కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలను రామభద్రపురం నుంచి బాడంగి, తెర్లాం మండలాలు మీదుగా మళ్లించారు. భారీ వాహనాలు రాకపోకలు చేయడంతో పినపెంకి నుంచి బొబ్బిలి వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులలో వరదనీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిరిడి జంక్షన్ సమీపంలో గోతిలో లారీ కూరుకుపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లు బాగు చేయాలని, పారాది నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన భారీ లారీ

ఆటంకాలు తప్పవా?

శృంగవరపుకోట : కొత్తవలస- కిరన్డోల్ (కేకే) లైన్లో తైడ- శివలింగపురం సెక్షన్ల మధ్య విరిగిపడిన కొండ చరియలను వాల్తేర్ డివిజన్ డిఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్ సీనియర్ అధికారులతో కలిసి బుధవారం రాత్రి తొలగించి గూడ్స్ రైళ్లు వెళ్లేందుకు లైన్ క్లియర్ చేసినప్పటికీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వల్ల ఈ లైన్లో రైళ్ళను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో అప్పటికే అరుకు చేరుకున్న కిరండూల్ - విశాఖపట్నం ట్రైన్ నుంచి బుధవారం రాత్రి ప్రయాణికులను ఆర్‌టిసి బస్సులలో విశాఖపట్నం చేర్చారు. ఇది ఎలా ఉండగా గురువారం విశాఖ నుండి కిరండూల్ వెళ్లవలసిన రైలును, కిరండూల్ నుంచి విశాఖ చేరాల్సిన పాసింజర్ రైలును ఈనెల 8వ తేదీ శుక్రవారం వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో అరుకు అందాలను చూసేందుకు ట్రైన్లో వెళ్లే ప్రయాణికులకు నిరాశ తప్పేలా లేదు. ఇది ఎలా ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా ఎస్ కోట నుంచి అరకు వెళ్లే రహదారిలో కూడా పలుచోట్ల చెట్లు, కొండ చర్యలు విరిగిపడ్డాయి. పలుచోట్ల వర్షపు నీరు జలపాతాలను తలపిస్తూ రోడ్లపై ప్రవహిస్తూ ఆటంకంగా మారింది.

నేడు మెగా జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరుగుతుందన్నారు. జాబ్ మేళాకు 13 కంపెనీలు నుంచి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేస్తారని, పది, ఇంటర్, డిప్లమో, ఐటిఐ, డిగ్రీ, బిఫార్మసీ, బిటెక్ పూర్తి చేసి 18 నుంచి 35ఏళ్ల లోపు నిరుద్యోగ యువత హాజరు కావాలన్నారు. జాబ్ మేళాలో 1200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో అరసాడ గ్రామంలోని పేదలకు సత్యసాయి సేవా కమిటీ కన్వీనర్ వెలది సుబ్బారావు ఆధ్వర్యాన దుప్పట్లు, రగ్గులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీరాపు శంకర్రావు, చిలకలపల్లి గౌరు, మరిశర్ల త్రినాథ, రామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సుబ్బారావు

స్వాధీనం చేసుకున్న బైక్, సారా ప్యాకెట్లతో ఎస్‌ఇబి అధికారులు, సిబ్బంది

సారా రవాణాపై దాడులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎస్‌ఇబి సిఐ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సారా రవాణాపై గురువారం దాడులు చేపట్టారు. ఒడిశా నుండి సారా రవాణా చేస్తున్నారన్న సమచారం మేరకు పార్వతీపురం మండలం ములగ జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనంతోపాటు వెయ్యి సారా ప్యాకెట్లను సీజ్ చేశారు. బిళ్లగుడ్డివలస గ్రామానికి చెందిన కొండగొర్రి నగేష్‌ని అరెస్టు చేశారు. నగేష్‌ని రిమాండుకు తరలించినట్లు సిఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఇబి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ కృష్ణారావు

దొంగ అరెస్టు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో ఒంటరి మహిళలనే లక్ష్యంగా పెట్టుకుని దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ కృష్ణారావు తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో జరిగిన నలుగురు మహిళల మెడలో బంగారు గొలుసుల దొంగతనాలకు సంబంధించి దొంగ మన రాష్ట్రానికి చెందిన వ్యక్తా? కాదా? అనే కోణంలో దర్యాప్తు చేసినట్లు తెలిపారు. 11 నెలల కాలంలో జిల్లా కేంద్రంలో ఉన్న చర్చివీధి, జనశక్తి కాలనీ, రామానంద్‌నగర్, వైకెఎం కాలనీలతోపాటు బొబ్బిలిలో జరిగిన బంగారు గొలుసుల దొంగతనం కేసులో ఒకే వ్యక్తి పాల్గొన్నట్లు జిల్లా క్రైమ్ పోలీసులు నిర్ధారించారని చెప్పారు. చోరీకి సంబంధించిన సిసి పుటేజ్‌లు కూడా పరిశీలించగా పట్టణంలో చాకలివీధికి చెందిన బుక్కురు లక్ష్మణరావు అనే వ్యక్తి ఈ దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఆయన నుంచి 9.2 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. లక్ష్మణరావుపై 382 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. కేసుకు సంబంధించి దర్యాప్తులో పాల్గొన్న సిసిఎస్ సిఐ సుధాకర్, పట్టణ హెచ్‌సి రాజశేఖర్, సిసిఎస్ హెచ్‌సిలు నారాయణ, గోవింద, పిసి ఉదయ్‌ను ఎస్‌పి అభినందించారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో చినరామ గ్రామ జంక్షన్ వద్ద గురువారం పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ జగదీష్‌నాయుడు పట్టుకున్నారు. దోనుబాయి నుంచి సీతంపేట వైపు వ్యానులో 60 బ్యాగుల్లో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

సీజ్ చేసిన వ్యాను